నమస్తే తెలంగాణ

ములుగు

జయశంకర్ భూపాలపల్లి

5 | ఆదివారం 31 డిసెంబర్ 2023 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


కానుకుర్తిశెట్టి సోమశేఖర్


నలిమెల భాస్కర్


మంచాల రమేశ్


మైథిలి అబ్బరాజు


సీఎస్ఆర్ ప్రభు

# సాహితీవేత్తల సేవలకు పురస్కారాలు

## నేడు సోమనాథ కళాపీఠం నేతృత్వంలో అవార్డుల ప్రదానం


అరూరి మహేందర్


బూసా రేణుకారాధ్య


ఎంఎస్ఆర్ వెంకటరమణ

పాలకుర్తి, డిసెంబర్ 30: సాహితీరంగంలో విశిష్ట సేవలందిస్తున్న కవులు, రచయితలకు ప్రతిఏటా సోమనాథ కళాపీఠం సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రతి ఏటా పురస్కారాలు అందిస్తున్నది. తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి జన్మస్థలమైన జనగామ జిల్లా పాలకుర్తిలో సోమనాథ కళాపీఠం నేతృత్వంలో 2021-22 ద్వైవార్షిక పురస్కారాలకు ఎంపికైన వారికి ఈ నెల 31న శ్రీసోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యానారాయణ, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి దామెదర్ తెలిపారు. శనివారం వారొక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్ జయరామరెడ్డి, ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు హాజరుకానున్నారు. సోమనాథ సాహిత్య పురస్కారానికి డాక్టర్ కానుకుర్తిశెట్టి సోమశేఖర్, సోమనాథ సామాజిక శోధన పురస్కారానికి డాక్టర్ నలిమెల భాస్కర్, సోమనాథ రంగస్థల పురస్కారానికి మంచాల రమేశ్, పందిళ్ల శేఖర్‌బాబు రాజయ్యశాస్త్రీ స్వచ్ఛంద భాషా సేవ పురస్కారానికి డాక్టర్ మైథిలి అబ్బరాజు, వీరమనేని చలపతిరావు సాహిత్య పురస్కారానికి ఎంఎస్ఆర్ వెంకటరమణ, ముశం దామోదర్‌రావు ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారానికి డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు, డాక్టర్ రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారానికి డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక బిరుదుకు బూష రేణుకారాధ్య ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# భర్తపై వేడి నీళ్లు పోసిన భార్యపై కేసు

తొర్రూరు, డిసెంబర్ 30 : భర్తపై వేడి నీళ్లు పోసి గాయపర్చిన భార్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొమ్మనపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ యాకూబ్-సరోజ దంపతులు. వారిద్దరి మధ్య నాలుగేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. యాకూబ్ ఏం పని చేయకపోవడంతో ఇంట్లోకి సరుకులు తీసుకురావడం లేదు. దీంతో నెల రోజులుగా సరోజ భర్తకు అన్నం పెట్టడం మానేయగా యాకూబ్ తన తల్లి వద్దనే ఉంటున్నాడు. ఈనెల 29న ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు ఇవ్వమని యాకూబ్‌ను సరోజ అడుగగా, ఆధార్ కార్డు ఇవ్వకపోగా కొట్టడానికి యత్నించాడు. ఈ క్రమంలో కూలికి వెళ్లి వచ్చి స్నానానికి పెట్టుకున్న వేడినీళ్లను భర్తపై పోసింది. తీవ్ర గాయాలతో యాకూబ్ ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి మగ్త్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, శంకర్‌నాయక్ తదితరులు

# సహకరిస్తాం.. పోరాటం చేస్తాం..

## కాంగ్రెస్ చెప్పిన మేరకు వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తాం
- ప్రజా సమస్యల పరిష్కారం, ఆరు గ్యారెంటీల అమలుపై పోరాడుతాం..
- మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి
- బీఆర్ఎస్ కృషితోనే రామప్పకు యునెస్కో గుర్తింపు, ములుగులో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- పార్టీ శ్రేణులు మనోధైర్యం కోల్పోవద్దని పిలుపు
- ములుగులో గట్టమ్మ, మేడారంలో తల్లులకు పూజలు

*ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి మా సహకారం తప్పకుండా ఉంటుంది. కాంగ్రెస్ చెప్పిన మేరకు ఆరు గ్యారెంటీలను వందరోజుల్లో అమలు చేయాలి.. ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం, గ్యారెంటీల అమలుపై మా పోరాటం ఉంటుంది' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీ దయాకర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యేలు అరూరి, శంకర్‌నాయక్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు.*

*-హనుమకొండ, డిసెంబర్ 30*

కోట్లాది మంది తరలివచ్చే సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హనుమకొండలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ అందరూ కొంగు బంగారంలా కొలిచే మేడారం జాతర వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఉండడం గర్వకారణమన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం గడిచిన పదేళ్లలో మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. జాతరను నాటి ఉమ్మడి పాలకులు నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మొదటి సారి జాతరలో భక్తులకు వసతులు కల్పించేందుకు రూ. 100 కోట్లు కేటాయించిందని, ఆ తర్వాత వరుసగా రూ.75కోట్ల చొప్పున కేటాయిస్తూ ఘనంగా జాతర జరిగేలా చూసిందని చెప్పారు. బీఆర్ఎస్, కేసీఆర్ కృషితోనే రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ చొరవతో ట్రైబల్ యూనివర్సిటీ రాష్ట్రానికి రావడం సంతోషకరమని, ఇందుకోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.17 కోట్లు వెచ్చించి యూనివర్సిటీకి కావాల్సిన భూములను సమకూర్చిందని, రూ.850కోట్లతో ఇప్పుడు యూనివర్సిటీ నిర్మాణం చేపట్టడం గర్వకారణమన్నారు.


మేడారంలో గుడి గంటలను కొడుతున్న ఎమ్మెల్సీ కవిత, ఎంపీ కవిత

### మనోధైర్యం కోల్పోవద్దు

ఉద్యమగడ్డగా పేరుగాంచి, ఇన్నేళ్లూ బీఆర్ఎస్ వెంట ఉన్న వరంగల్ ప్రజలు, ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని, అందుకే అనుకున్న ఫలితాలు రాలేదని, పార్టీ కోసం పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని, మళ్లీ మంచి రోజులు వస్తాయని, అప్పటి వరకు ధైర్యంతో పార్టీ సిద్ధాంతాల మేరకు ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. గతంలో 44 లక్షల మందికి పింఛన్లు వచ్చేవని, ఇప్పుడు గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తుల స్వీకరణ పెట్టి డిసెంబర్, జనవరిలో పెన్షన్లు రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ రైతుబంధు కూడా రాలేదన్నారు. తాము ఎక్కడికెళ్లినా పెన్షన్, రైతుబంధు రానివారు బాధపడుతూ చెబుతున్నారన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల్లో స్పష్టత లేదన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారు బిల్లు కట్టడం అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, జనవరిలో బిల్లు కట్టాలా వద్దా అనేది స్పష్టత లేదన్నారు. దరఖాస్తులో కేవలం ఐదు పథకాలకు సంబంధించిన కాలమ్స్ మాత్రమే ఉన్నాయని, నిరుద్యోగ భృతి గురించి ఫాంలో లేదన్నారు. ఎఫ్ఐఆర్ ఉన్న ఉద్యమకారులు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారని, ఎఫ్ఐఆర్ లేకుండా ఉద్యమాలు చేసిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ఎలాంటి కష్టాలు ఉండేవో ఇపుడు మళ్లీ అవే కష్టాలు మొదలయ్యాయన్నారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సుందర్ రాజు యాదవ్, తెలంగాణ జాగృతి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ భాస్కర్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బీఆర్ఎస్ కన్వీనర్ జనార్దన్ గౌడ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, జాగృతి విభాగం నాయకులు పాల్గొన్నారు.

### దళితబంధు ఇప్పించాలని వినతి

దళితబంధు రెండో విడుతలో ములుగు జిల్లా నుంచి ఎంపిక చేసిన 1100మందికి పథకాన్ని ఇప్పించాలని కోరుతూ ఎమ్మెల్సీ కవితకు దళితులు వినతిపత్రం సమర్పించారు. మూడు నెలల క్రితం తమను లబ్ధిదారులుగా ఎంపిక చేసి జాబితా విడుదల చేశారని, ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు కాలయాపన చేస్తూ తమకు పథకం వర్తింపజేయకుండా చేస్తున్నారని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.


గట్టమ్మ వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ మంత్రి సత్యవతి

### తల్లులకు పూజలు

ములుగురూరల్/ తాడ్వాయి, డిసెంబర్ 30 : ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం మధ్యాహ్నం ములుగు జిల్లాలోని ఆదిదేవత గట్టమ్మను, మేడారంలో సమక్క, సారక్కను దర్శించుకున్నారు. ముందుగా ఆమెకు గట్టమ్మ వద్ద ములుగు జడ్పీచైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అనంతరం మేడారంలో సమ్మక్క, సారలమ్మ దర్శనానికి రాగా వారికి పూజారులు, దేవాదాయశాఖ అధికారులు డోలివాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికి తల్లుల గద్దెల వద్దకు తీసుకువెళ్లారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై పసుపు, కుంకుమ, బెల్లం, నూతన వస్త్రాలను సమర్పించి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు వారికి అమ్మవారి వస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఎమ్మెల్సీ కవిత వెంట దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్, జడ్పీటీసీ గై రుద్రమదేవి, భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పోరిక రవీందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చెన్న విజయ్ తదితరులున్నారు.

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

- ములుగు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా
- ప్రభుత్వ ఉద్యోగులకు 5లోగా వేతనాలు
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- ములుగు, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో పర్యటన


తాడ్వాయి: గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్/గోవిందరావుపేట/తాడ్వాయి, డిసెంబర్ 30 : కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో భాగమైన ఆరు గ్యారెంటీల అమలు కోసమే ప్రజా పాలన కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె శనివారం ములుగు, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో పర్యటించారు. ములుగు మండలం బండారుపల్లి గ్రామ పరిధిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, గోవిందరావుపేట మండలం పస్రాలో సర్పంచ్ ముద్దబోయిన రాము అధ్యక్షతన, తాడ్వాయి మండలం మొండ్యాలతోగు, కొండపర్తి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో సీతక్క మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను అర్హులకు అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల 2 నుంచి 5వ తేదీలోగా వేతనాలు చెల్లించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రాబోయే కాలంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ములుగు జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దీవెనలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని చెప్పారు. గోవిందరావుపేట మండలం రాఘవపట్నం సమీపంలోని బ్రిడ్జిని మంత్రి పరిశీలించారు. జాతర దృష్ట్యా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని, రూ.40లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోకి తరలిస్తామని వివరించారు. నూతనంగా నిర్మించే అంగన్‌వాడీ సెంటర్లను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్మించేలా చర్యలు చేపడుతామని మంత్రి తెలిపారు. పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. 163వ జాతీయ రహదారి నుంచి కొండపర్తికి త్వరలోనే రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేకంగా గొత్తికోయల గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని ఆధికారులను ఆదేశించారు. గొత్తికోయలతో ప్రత్యేకంగా మాట్లాడిన సీతక్క పిల్లలు ఏ ఆహారాన్ని ఇష్టంగా తింటారో అంగన్‌వాడీ టీచర్లకు తెలుపాలని, అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

జిల్లాకు వచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ కంపెనీ, టాటా గ్రూప్ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి గిరిజనుల జీవన విధానాన్ని వివరించారు. ఆయాచోట్ల కార్యక్రమాల్లో ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, డీడబ్ల్యూవో ప్రేమలత, డీఆర్‌డీఏ పీడీ నాగపద్మజ, డీపీవో వెంకయ్య, బండారుపల్లి సర్పంచ్ అక్కల రఘోత్తం, ఉప సర్పంచ్ దొంగరి మహేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, చింతనిప్పుల భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు

# కోల జనార్దన్ మృతి

- నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, బోయినపల్లి
- హాజరైన ఎంపీలు దయాకర్, కవిత, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర, పెద్ది


జనార్దన్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంపీలు దయాకర్, కవిత, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి

కృష్ణకాలనీ, డిసెంబర్ 30 : తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కోల జనార్దన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కాగా, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, భూపాలపల్లి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతుడి స్వగ్రామమైన గణపురం మండల కేంద్రానికి చేరుకొని ఆయన పార్థివదేహంపై పూలమాలలుంచి నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత, బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కోల జనార్దన్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భవించిన తొలి రోజుల్లో 2001 నుంచి 2005 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీని ముందుకు నడిపించారన్నారు. ఉద్యమ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. బీఆర్ఎస్ గొప్ప నాయకుడిని కోల్పోయిందని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. జనార్దన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి, నాయకులు పోలుసాని లక్ష్మీనరసింహారావు, భరత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్


- పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కేందుకే 'ప్రజాపాలన'
- హామీలను కాంగ్రెస్ నెరవేర్చకుంటే పోరాడాలి
- బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పిలుపు


దేవరుప్పులలో బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి/దేవరుప్పుల/రాయపర్తి, డిసెంబర్ 30: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి ప్రజలను మభ్యపెడుతున్నారని, ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి, దేవరుప్పుల, వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారెంటీల పేరుతో హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని ఎర్రబెల్లి తెలిపారు. వీటిని అమలు చేయకుండా శ్వేతపత్రాలు విడుదల చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఆరు దశాబ్దాల్లో జరగని అభివృద్ధి పనులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసి చూపారని, వ్యవసాయాన్ని పండుగలా మార్చారని ఎర్రబెల్లి తెలిపారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపిస్తున్న కాంగ్రెస్‌కు 50 లక్షల కోట్ల మేరకు ఆస్తులు పెంచిన విషయం గుర్తించలేదన్నారు. కాళేశ్వరం టూర్‌లో మంత్రుల తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు రైతుబంధు డబ్బులు అందకుండా అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక కూడా నేటికీ రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం లేదన్నారు. 'ప్రజాపాలన'లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు పోరాడాలన్నారు. తనహయాంలోనే పాలకుర్తి నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి జరిగిందని, మిగిలిన పనులు పూర్తి చేయించేలా రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలన్నారు. వాగులపై చెక్‌డ్యాములు, హైలెవల్ వంతెనలు, బీటీ రోడ్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి, కొడకండ్ల జడ్పీటీసీలు పుస్కూరి శ్రీనివాస్‌రావు, కేలోత్ సత్తమ్మ, బీఆర్ఎస్ కొడకండ్ల, పాలకుర్తి మండలాల అధ్యక్షులు సిందె రామోజీ, పసునూరి నవీన్, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి వీరమల్ల రాజు, అశోక్ రెడ్డి పాల్గొన్నారు. దేవరుప్పులలో జరిగిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్, దునూరి నర్సింహారెడ్డి, కొల్లూరు సోమయ్య, ధరావత్ రాంసింగ్, కారుపోతుల భిక్షపతి, హనుమంతు, ఏల సుందర్, జోగు సోమనర్సయ్య, మొల్గూరు రమేశ్, ఆలకుంట్ల యాదగిరి, కోతి ప్రవీణ్ పాల్గొన్నారు. రాయపర్తిలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, మండలఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్ల సుధీర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ సురేందర్‌రావు పాల్గొన్నారు.

# ఐదుగురు చిన్నారులకు కొవిడ్ పాజిటివ్

- నలుగురి వయస్సు రెండేళ్లలోపే
- వరంగల్ ఎంజీఎం దవాఖానలో వైద్యం
- ఒకరికి ప్రత్యేక విభాగంలో చికిత్స, మరో నలుగురికి హోం ఐసొలేషన్



వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 30 : కొవిడ్ కొత్త వేరియంట్ వరంగల్‌వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. అనారోగ్యంతో బాధపడుతూ ఎంజీఎం వైద్యశాలకు వచ్చిన ఐదుగురు చిన్నారులను పరీక్షించగా వారికి పాజిటివ్ అని తేలడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెండు, మూడు రోజుల నుంచి వైద్య చికిత్సల కోసం ఎంజీఎంకు వచ్చిన చిన్నారుల్లో కొవిడ్ లక్షణాలను గుర్తించిన వైద్యులు, నమూనాలను సేకరించి, కేఎంసీలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. శనివారం నివేదికలు పాజిటివ్ అని రావడంతో సదరు పిల్లలకు వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. చిన్నారుల్లో కొవిడ్ వ్యాప్తిని గుర్తించినందున పిల్లల వార్డు(పీడియాట్రిక్ వార్డు)లో ఆక్సిజన్ సౌకర్యం కలిగిన 20 పడకల ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి, వెంటిలేటర్లు సమకూర్చుకొని అప్రమత్తంగా ఉన్నామని విభాగాధిపతి డాక్టర్ ప్రతాప్ తెలిపారు. బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ దుగ్గొండి మండలానికి చెందిన ఒక్కరిని మాత్రమే అడ్మిట్ చేసుకున్నట్లు చెప్పారు. మిగతా నలుగురి వయస్సు ఒకటి నుంచి రెండేళ్ల మధ్య ఉండడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో కుటుంబసభ్యులకు తగు జాగ్రత్తలు తెలిపి హోం ఐసొలేషన్‌లో ఉంచినట్లు వివరించారు. బాధితులు ఒకే ప్రాంతానికి చెందిన వారు కాకపోవడం కొంత ఆందోళన కలిగించే అంశమని ఆయన అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిన వివరాల ప్రకారం ఈ వేరియంట్ ప్రాణహాని కలిగించే అవకాశాలు చాలా తక్కువని, ఐనప్పటికీ ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరి ధరించాలని, సామాజిక దూరాన్ని పాటించడం, ప్రయాణాలు వాయిదా వేసుకోవడం శ్రేయస్కరమని ఆయన సూచించారు.